ఖరీఫ్ సాగులో రైతులు బిజీబిజీ

- 41,550 ఎకరాల్లో సాగుకు సమాయత్తం
- రైతులకు అనుకూలంగా వాతావరణం
- రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ


రెండవ దశ దుక్కులు పూర్తయిన వ్యవసాయ భూమి


రామనపూడిలో మొలకెత్తుతున్న నారుమడి

గుడివాడరూరల్: ఖరీఫ్ సాగులో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి గత మూడు రోజులుగా వర్షాలు పడటంతో దుక్కులు దున్నడం, నారుమడులు పోయడం లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో 41,550 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. ఇప్పటికే రైతులు మొదటి దశ దుక్కులు పూర్తి చేసి రెండో దశ దుక్కులు దున్నడం చేపట్టారు. దీంతో పాటే నారుమడులు పోసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఆయా రైతుల కోసం ప్రభుత్వం నుంచి సుమారు 630 క్వింటాళ్ల వరి(మూడు రకాల) విత్తనాలను సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. వీటితో పాటు ఇప్పటికే వ్యవసాయ భూములను సారవంతం చేసేందుకు వివిధ రకాలైన పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసర విత్తనాలను సుమారు 270 క్వింటాళ్లు సబ్సిడీ ధరపై రైతులకు అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో ఈ ఏడాది సైతం ఆయా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మండలాల వారీగా సాగు, విత్తనాల పంపిణీ లక్ష్యం

మండలం	ఖరీఫ్‌సాగు (ఎకరాల్లో)	విత్తనాల పంపిణీ (క్వింటాళ్లలో)
గుడివాడ	14,900	300
గుడ్లవల్లేరు	22,500	300
నందివాడ	4,150	30
మొత్తం	41,550	630

విత్తనాల కోసం ప్రణాళిక

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 41,550 ఎకరాల్లో సాగుకు సమాయత్తమవుతున్నట్లు ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. ఆయా సాగుకు సంబంధించి మొదటి దశ ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, బీపీటీ 5204 తదితర రకాల వరి విత్తనాలు సుమారు 630 క్వింటాళ్లు రైతులకు అందజేసేందుకు రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధం చేశారు. గత మూడు రోజుల నుంచి అక్కడక్కడా వర్షాలు పడటంతో రైతులు నారుమడులు పోసే పనుల్లో బిజీగా ఉన్నారు. సకాలంలో సాగు నీరు విడుదలయితే నారు చేతికి అందే సమయానికి నాట్లు వేసే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా శివారు గ్రామాలకు సాగునీరు అందేలా అధికారులు ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రణాళిక సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సంబంధించి వ్యవసాయశాఖ అన్ని ప్రణాళికలు సిద్ధం చేసింది. భూసారాన్ని పెంచేందుకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట, జనుము, పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేశాం. వరి విత్తనాలు కూడా సకాలంలోనే రైతులకు అందజేస్తాం. ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల ద్వారా విత్తనాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత గ్రామాల రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

–బి.అనంతలక్ష్మి, ఏఓ

కోరిన కోర్కెలు తీర్చే వీరమ్మ తల్లి


అమ్మవారిని దర్శించుకుంటున్న చిత్తర్వు నాగేశ్వరరావు తదితరులు

గుడ్లవల్లేరు: భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మామిడికోళ్ల శ్రీ వీరమ్మ తల్లి అమ్మవారు అని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. గ్రామంలో అమ్మవారి ఆలయాన్ని సుమారు రూ.40 లక్షలతో గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేద పండితులు నిర్వహించిన గణపతి, వాస్తు హోమాలు, ప్రత్యేక పూజలకు చిత్తర్వు నాగేశ్వరరావు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది విక్రమ్ హెగ్డే, హైకోర్టు న్యాయవాది మురళీమోహన్, ఆలయ నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ జెట్టి శ్రీరాం, చావా నాగేశ్వరరావు, తోట ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు, చిత్తర్వు కౌశిక్, చావా సుభాష్ పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం


కైకలూరులో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని


గుడివాడలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కైకలూరు: దేశంలో ప్రజాసేవ చేయడానికి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అనుసరించిన విధానాలు నేటి తరానికి అనుసరణీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ట్రావెలర్స్ బంగ్లాలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళుర్పించారు. పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ కోల్‌కతా విశ్వవిద్యాలయ కులపతిగా, మాజీ కేంద్ర మంత్రిగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రజలకు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు పైడిపాటి శివశంకర్, గరికిపాటి రాంబాబు, బాషా, తానంకి సాయి, బండి శ్రీను, వెంద్ర నాగరాజు, పామర్తి రాంబాబు, సమయం ఏసుబాబు, కొల్లిబాబి, మల్యాద్రి పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకటకృష్ణ, జిల్లా కన్వీనర్ సూరే గాంధీ, జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, వలపర్ల వెంకటేశ్వరరావు, బి.శంకరరావు, శివాజి, జనార్దన్ పాల్గొన్నారు.

ఆదివారం సెలవు అమలు చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుడివాడ టౌన్: విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా విద్యార్థులకు ఆదివారం సెలవు కచ్చితంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో వారు విచారించగా 9, 10 తరగతుల విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నట్లు యాజమాన్యాలు తెలిపాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నించగా విద్యాశాఖ అధికారులు తమకు అనుమతి ఇచ్చారనడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. అదేవిధంగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో పుస్తక వ్యాపారానికి అనుమతులు ఉండబోవని, విద్యా సంస్థలు బలవంతంగా అధిక ధరలకు పుస్తకాలు కొనుగోలు చేయించి, విద్యార్థులను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్.సమీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సలీమ్ పాల్గొన్నారు.

‘మానవత’ నూతన కార్యవర్గం


ఎన్నికైన మానవత స్వచ్ఛంద సంస్థ కైకలూరు యూనిట్ కార్యవర్గం


గుడివాడలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

కైకలూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కైకలూరు యూనిట్ 2024–25 ఏడాదికి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు పొల్లూరి వీర శేషగిరిరావు హాజరయ్యారు. నూతన కార్యవర్గ అధ్యక్షురాలిగా కొండ్రెడ్డి చిట్టెమ్మ, కార్యదర్శిగా మాడెం వీర వెంకట సత్యనారాయణ, కోశాధికారిగా యిమ్మడి పాండురంగ విఠల్, ఉపాధ్యక్షుడిగా కాట్రగడ్డ అనిల్‌కుమార్(నాని), సంయుక్త కార్యదర్శిగా శీలం కృష్ణవేణి, ఈసీ విద్యా విభాగానికి గంగుల వెంకట సీతారామంజనేయులు, ఈసీ ఆరోగ్య విభాగానికి పిచ్చికల పవన్ కాంత్, ఈసీ అవగాహన నిమిత్తం బూరుబోయిన మోహనరావు, ఈసీ అత్యవసర విభాగానికి ఎండీ. గాలిబ్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు. పూర్వ అధ్యక్షుడు కొండ్రెడ్డి వెంకట సత్యనారాయణ(పెదబాబు), ప్రధాన కార్యదర్శి తలారి వేణుగోపాలకృష్ణ, కోశాధికారి గుర్రం శ్యామ్‌కుమార్, సభ్యులు హాజరయ్యారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. స్థానిక వాసవీచౌక్ లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా అన్నపురెడ్డి గోపిరెడ్డి, కార్యదర్శిగా నందమూరి పద్మజ, కోశాధికారిగా గంటా చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షుడిగా దండమూడి సీతారామస్వామి, సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకట మోహనరావు, 12 మంది కార్యనిర్వాహక సభ్యులతో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా అధ్యక్షుడు పీవీ శేగిరిరావు, దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు లంకదాసరి ప్రసాదరావు, పూర్వ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, గూడపాటి వెంకటేశ్వరరావు, గుత్తా రమేష్, మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు విరాళం



ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీరేణుకా ఎల్లమ్మ వారి జాతర మహోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జాతర ఉత్సవాలకు ఆదివారం కైకలూరుకు చెందిన బీకేఎం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బీకేఎం నాని, బొమ్మనబోయిన విజయలక్ష్మి దంపతులు రూ.12 వేలు విరాళంగా చెక్కు రూపేణా నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, సమ్మెట సాయి, కత్తి శివస్వామి, కాసాని బాల ఏసు, నక్కా హేమంత్, పాల్గొన్నారు.

సుబ్బారాయుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్లశాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో స్వామిని దర్శించుకునేందుకు అధిక సమయం క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. సహాయ కమిషనర్ నేల సంధ్య చొరవతో ఆలయ కళామండపంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ప్రసాదపు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

కెమిస్ట్రీతో ఉద్యోగావకాశాలు పుష్కలం

కైకలూరు: డిగ్రీలో చేరనున్న విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా ఒక మేజరు సబ్జెక్టును ఎంచుకునే అవకాశం ఉందని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కె.సుజాత తెలిపారు. రసాయన శాస్త్రంలో విద్యనభ్యసించేందుకు కాలేజీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కెమిస్ట్రీని మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుంటే ఫార్మారంగం, రసాయన పరిశ్రమలలో కెమిస్టులు, అనలిస్టులుగా స్థిరపడవచ్చని తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో రసాయనశాస్త్రం చదివి అధ్యాపకులుగా ఉద్యోగం పొందవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రూప్స్ రాసి విజయం సాధించవచ్చని తెలిపారు. కైకలూరు కాలేజీలో అత్యంత బోధనానుభవం కలిగిన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ప్రాంగణ ఎంపికలో ప్రతి ఏడాది 10 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లు, ఎంఓయూలు, ఫీల్డ్, ఇండస్ట్రియల్ ట్రిప్స్, జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, వెబినార్, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 92472 03460, 99495 49365 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఖాళీ స్థలాలపై దృష్టి పెట్టండి


సత్యనారాయణపురం గంటావారి వీధిలో చెరువుగా మారిన ఖాళీ స్థలం

గుడివాడ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాలలో ఏర్పడిన గోతులు చెరువులను తలపిస్తున్నాయి. మెరక ఉన్న ఖాళీ స్థలాలు చెట్లు, పొదలతో కిక్కిరిసి పోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నీట మునిగిన స్థలాల్లో పరిసర ప్రాంత ప్రజలు కుళ్లిన పదార్థాలు పడవేయడంతో అవి దుర్గంధం వెదజల్లుతున్నాయని, దోమల కార్ఖానాగా తయారవుతున్నాయని స్థానికులు అంటున్నారు. వర్షాలు ప్రారంభమయ్యాయి కనుక నీటి మట్టాలు పెరిగి వాటిలో పందులు సంచరిస్తున్నాయి. వీటి వలన అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఓపెన్ బార్‌లుగా తయారయ్యాయని, గుర్తు తెలియని వ్యక్తులు స్థలాల్లో మద్యం సేవిస్తున్నారని ఇరుగుపొరుగువారు ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్థలాల యజమానులపై ఆంక్షలు విధించి స్థలాలను శుభ్రపర్చి మెరక తోలించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

దోమల బాధ భరించలేకపోతున్నాం



ఖాళీ స్థలాల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పరిసర ప్రాంత ప్రజలు వాటిలో వ్యర్థాలు వేయడం కారణంగా అవి కుళ్లి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వీటిలో భారీగా దోమలు చేరి రాత్రివేళ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. వెంటనే వాటిని మెరక చేయించి సమస్య పరిష్కరించాలి.

– పి.బాలసుమంత్‌రెడ్డి, స్థానికుడు

పందులకు స్థావరాలుగా మారాయి



ఖాళీ స్థలాల్లో ఏళ్ల తరబడి పిచ్చిమొక్కలు పెరిగి దుబ్బులుగా ఏర్పడటంతో అవి పందులకు ఆశ్రయంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పాములు సంచరిస్తున్నాయి. ఇక మందుబాబుల సంగతి చెప్పలేం. పరిసర ప్రాంత ఇళ్ల యజమానులు సమస్యను ఖాళీ స్థలం యజమాని దృష్టికి తీసుకువెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు కాని బాగుచేయించే పనులు చేపట్టడంలేదు. అధికారులే చర్యలు చేపట్టాలి.

– పి.హారిక, స్థానికురాలు

సమస్యలు పరిష్కరిస్తున్నాం



పట్టణంలో ఈ సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. కొన్ని ప్రాంతాల్లో చర్యలు చేపట్టాం. ఇబ్బందికర స్థలాలు ఉంటే వాటిని ఫొటోతీసి మున్సిపల్ కార్యాలయానికి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. యజమానులకు నోటీసులు ఇస్తాం. వారు స్పందించకపోతే పురపాలక సంఘం ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించి అయిన ఖర్చులు స్థలం యజమానిచేత కట్టిస్తాం.

– జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్

నారుమడులు కళకళ


పచ్చగా కళకళలాడుతున్న వరినారుమడి


తోట్లవల్లూరులో నారుమడికి బోరు ద్వారా నీరు పెట్టిన రైతు

తోట్లవల్లూరు మండలంలో వరి నారుమడులు కళకళలాడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నారుమడులు ఏపుగా ఎదుగుతూ పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయి. వరి నారుమడులు అదనుకు వస్తుండటంతో అన్నదాతలు వరినాట్ల కోసం మాగాణి పొలాలను సిద్ధం చేస్తున్నారు.

– తోట్లవల్లూరు

పెండ్లికుమారుడిగా వేంకటేశ్వరస్వామి


పెండ్లికుమారుడి అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నిమ్మకూరు(పామర్రు): టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామిని పెండ్లికుమారుడిగా అలంకరించారు. తొలుత ఆలయంలో నిత్యార్చన, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాశరం యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పామర్రు: పెదపారుపూడి మండలం యలమర్రులో నూతనంగా నిర్మిస్తున్న 400 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగవచ్చని పర్యవేక్షక ఇంజినీరు ఆపరేషన్ అధికారి ఎం.భాస్కర్‌రావు ఆదివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పామర్రు 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

దాతల సాయం అభినందనీయం



కైకలూరు: పేదలకు అన్నా క్యాంటిన్ పేరుతో ఉచిత భోజనం అందించేందుకు ఆర్థిక సాయం చేస్తున్న దాతలను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించారు. స్థానిక తాలూకా సెంటర్‌లో కొద్ది రోజులుగా అన్నా క్యాంటిన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్ సిబ్బంది ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, పట్టణ సీఐ ఆకుల రఘు, ఎస్సై ఆర్.సత్యనారాయణ, ఏఎస్సై మల్లికార్జునరావు, కూటమి నేతలు కొల్లి బాబీ, పెన్మత్స త్రినాథరాజు, పూలా రాజీ, బలే ఏసురాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు నిమిత్తం పల్లెవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుడివాడ డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఆదివారం తెలిపారు. పల్లెవాడ స్టేషన్ పరిధిలోని పల్లెవాడ, చినరామవరం, గోనెపాడు, శింగాపురం, లక్ష్మీనారాయణపురం, నత్తగుళ్లపాడు, చటాకాయి, భుజబలపట్నం, పెంచికలమర్రు, కొట్టాడ, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, జంగంపాడు, వడ్లకూటితిప్ప, గోకర్ణపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సోలార్ వీధి దీపాల ఏర్పాటు



తోట్లవల్లూరు: సోలార్ వీధి దీపాల ఏర్పాటు పనులు తోట్లవల్లూరులో కొనసాగుతున్నాయి. గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొట్లూరి రాజమోహన్(బెంగళూరు) సహకారంతో రూ. 4.40 లక్షల వ్యయంతో 20 సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పెద్దు పాపారావు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, పీహెచ్‌సీ, జెడ్పీ పాఠశాల ఆవరణలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోలార్ వీధి దీపాల ఏర్పాటు పట్ల సర్పంచ్ పెనుమత్స రాధిక హర్షం వ్యక్తం చేయటంతో పాటు గ్రామపంచాయతీ తరఫున తమవంతు సహకారం అందిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేని సమయంలో సోలార్ వీధి దీపాలు ప్రజలకు ఉపయోగపడతాయి.

వైభవంగా బలుసులమ్మ ఊరేగింపు



ముదినేపల్లి రూరల్: మండలంలోని శ్రీహరిపురం శివారు ఐనంపూడిలో కొలువైయున్న శ్రీబలుసులమ్మ వారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని వేదికపై ఉంచి అందంగా అలంకరించి ఆలయ ధర్మకర్త పెద్దింటి కృష్ణమూర్తి ఇంటి నుంచి మేళతాళాలు, కనకతప్పెట్లతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

28 నుంచి కంటి పొర చికిత్స శిబిరం

కూచిపూడి(మొవ్వ): శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, నటరాజ నాట్యాంజలి సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడిలో ఈ నెల 28వ నుంచి జులై 6వ తేదీ వరకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గడ్డమణుగు శివ తెలిపారు. రామమూర్తి శత జయంతి సందర్భంగా ఈ శిబిరాన్ని కూచిపూడిలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ సెంటర్లో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మొబైల్ ఐ సర్జరీ యూనిట్ ద్వారా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 28 నుంచి జులై 4వ తేదీ వరకు కంటిపొర పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కంటి ఆపరేషన్లు 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 99855 32417, 98858 88615లో సంప్రదించాలని తెలిపారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు. క్యూలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.